

‘ఈ దేహం బతికున్నంత వరకే’ అన్న వేదాంతాన్ని పూర్వ పక్షం చేస్తూ సృష్టికి ప్రతిసృష్టి చేస్తున్నాడు రాజేశ్! మరపురాని మనుషుల్ని మళ్లీ మళ్లీ చూడాలనే కోరికను నిజం చేసే సృజనాత్మక శిల్పి అతడు. ప్రాణానికి ప్రాణమైన మనిషిని ప్రతిమగా మలచగలడు. ప్రాణమొక్కటే పోయలేడు. అతని సృజనే మీ లేనిది ఉన్నట్టుగా చూపే ఇంద్రజాలం కాదు. ఉన్నది ఉన్నట్టుగా సృష్టించే రాజేంద్రజాలం. సహజత్వమే తన శిల్ప కళకు ప్రమాణం. సజీవ శిల్పాల సృష్టే అతని ప్రయాణం!

# సజీవ శిల్పి!





దైవ సాక్షాత్కారం కోసం రుషులు తపస్సు చేసినంత దీక్షతో శిల్పాలకు రూపమిస్తాడు రాజేశ్. అతడి సృజనకు మెచ్చి.. దైవమే దిగి వస్తుందేమో! శిల్పాలే అయినా.. సజీవంగా వెలిసిన అనుభూతిని కలిగిస్తాయి రాజేశ్ మలిచిన సాయి రూపాలు. హైదరాబాద్‌లో పుట్టి పెరిగిన రాజేశ్ దేశవ్యాప్తంగా ప్రసిద్ధి చెందడానికి ఓ కారణం ఉంది. షిరిడీని దర్శించుకున్న భక్తులకు రాజేశ్ శిల్పాలు సుపరిచితమే. సాయి ఆలయంలోని ధ్యాన మందిరంలో కొలువుదీర్చిన శిల్పాన్ని చూస్తే... అచ్చంగా బాబా వచ్చి కూర్చున్నాడా అన్నట్టు ఉంటుంది. ‘ఈ సజీవ శిల్పానికి ప్రాణం పోసిన శిల్పి.. రాజేశ్’ అని రాసి ఉంటుందక్కడ. ఆలయ ప్రాంగణంలో ప్రతిష్ఠించిన మరో నాలుగు బాబా విగ్రహాల రూపకర్త కూడా రాజేశే!

## ఈ దేవుడు నాకే దక్కాలి!

సాయిబాబా శిల్పాలను తీర్చిదిద్దడం వెనుక ఓ కథ ఉందంటాడు రాజేశ్. ‘ఓ భక్తుడు సాయిబాబా సజీవ శిల్పం చేయడానికి నా దగ్గరికి వచ్చాడు. ఆర్డర్ ఇచ్చి పోయాడు. విగ్రహం పూర్తయింది. దాన్ని తన ఇంటికి తీసుకుపోయాడు. విగ్రహాన్ని ఆలయానికి తరలించే వేడుక కోసం ఆయన తన బంధువులను, మిత్రులను ఆహ్వానించాడు. వచ్చిన వారంతా ఆ విగ్రహాన్ని చూసి ఆశ్చర్యపోయారు. బాబా మళ్లీ మనిషిగా వచ్చినట్టుందన్నారట. దీంతో ఆ భక్తుడు మనసు మార్చుకున్నాడు. బాబా విగ్రహాన్ని ఆలయానికి ఇవ్వకుండా తన ఇంట్లోనే ప్రతిష్ఠించి నిత్య పూజలు చేయడం మొదలుపెట్టాడు. ఆలయానికి ఇచ్చిన మాట తప్పకూడదని మరో విగ్రహం చేయమని నాకు ఆర్డర్ ఇచ్చాడు’ అని ఆనాటి ముచ్చట చెబుతాడు రాజేశ్.



అప్పటి నుంచి లెక్కకు మించి బాబా విగ్రహాలు తయారు చేశారు. ఈ శిల్పి ప్రతిభను గుర్తించిన షిరిడీలోని శ్రీసాయిబాబా సంస్థాన్ ట్రస్ట్ ఆయన రూపొందించిన విగ్రహాన్ని ధ్యాన మందిరంలో ప్రతిష్ఠించింది. క్యూ కాంప్లెక్స్‌లో మరో నాలుగు మూర్తులను కొలువు దీర్చింది. రాజేశ్ మలిచిన సాయి విగ్రహాలు అమెరికా, ఇంగ్లండ్, ఆస్ట్రేలియా మొదలైన దేశాల్లోని 65 మందిరాల్లో నిత్య నీరాజనాలు అందుకుంటున్నాయి. మహావతార్ బాబా, మెహర్ బాబా తదితర యోగుల విగ్రహాలనూ ఆయన తీర్చిదిద్దారు.

సజీవ శిల్ప కళతో ఏ మూర్తినైనా సశరీరంతో ఉన్నట్టుగా ఆవిష్కరించగల దిట్ట రాజేశ్.

అందుకే, సినీ తారలను, నాయకుల విగ్రహాలను ఆయనతో తయారు చేయిస్తుంటారు అభిమానులు. కాలం చేసిన తల్లిదండ్రుల చిత్తరువులు ఇచ్చి రాజేశ్‌తో సజీవ శిల్పాలు చేయించుకుంటారు కొందరు శ్రీమంతులు. ఆయన చేతిలో మలిచిన మూర్తులు వాళ్లు మళ్లీ బతికి వచ్చారా అన్నట్టుగా ఉంటాయంటే అతిశయోక్తి కాదు. ఆ విగ్రహాలను ఇండ్లలో ప్రతిష్ఠించుకొని గతించిన వారి జ్ఞాపకాలను శాశ్వతం చేసుకుంటున్నారు.



రాజేశ్